# పనిచేసే ప్రభుత్వానికే పట్టం కట్టాలి

- మంచిర్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నడిపల్లి దివాకర్‌రావు
- పలు మండలాల్లో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు



లక్షెట్టిపేట : సూరారంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు

లక్షెట్టిపేట, నవంబర్ 22: పని చేసే ప్రభుత్వానికే ఓటు వేసి, పట్టం కట్టాలని ప్రజలను మంచిర్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నడిపల్లి దివాకర్‌రావు కోరారు. లక్షెట్టిపేట మండలంలోని సూరారం, కొత్త కొమ్ముగూడెం, పాత కొమ్ముగూడెం, దౌడేపల్లి గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు వస్తున్నారని వాళ్ల మాటలకు నమ్మి మోసపోవద్దన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న కష్టాలు మర్చిపోవద్దన్నారు. మనం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను పది సంవత్సరాల్లో దేశంలోనే అన్ని రాష్ట్రాలకంటే ఎక్కువగా అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఇప్పుడు తెలంగాణను మళ్లీ కాంగ్రెస్ చేతిలో పెడితే మళ్లీ గోస పడాలని తెలిపారు. తెలంగాణ సాధించుకునేందుకు ప్రాణాలను పణంగా పెట్టిన కేసీఆర్‌తోనే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బిడ్డ తల్లి దగ్గర ఉంటే ఎంత సంతోషంగా ఉంటుందో తెలంగాణకు సీఎంగా కేసీఆర్ ఉంటేనే అంత భద్రంగా ఉంటుందనీ, అన్ని వర్గాలు సంతోషంగా ఉంటాయని తెలిపారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించి మళ్లీ మన సీఎం కేసీఆర్‌ను ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అప్పుడే తెలంగాణ పచ్చగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, ఉపాధ్యక్షుడు అంకతి రమేశ్, ప్రధానకార్యదర్శి అనిల్ రెడ్డి, ఆయా సర్పంచ్‌లు మంచి కట్ల శంకరయ్య, బండి సత్తయ్య, రావుల రాజేశం, నాయకులు కారుకూరి సత్తయ్య, అనిల్ రెడ్డి, కొమిరెడ్డి సూరన్న, రాజాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లక్షెట్టిపేట : కొమ్ముగూడెంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు

**మండలంలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం.**

దండేపల్లి, నవంబర్22: దండేపల్లి మండలంలోని నర్సాపూర్, దమ్మన్నపేట, గూడెం, అల్లీపూర్ గ్రామాల్లో మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావుకు మద్దతుగా బుధవారం బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటేసి దివాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, బీఆర్ఎస్ యూత్ నాయకులున్నారు.

## అనారోగ్య బాధితుడికి ఆర్థిక సహాయం

మంచిర్యాల ఏసీసీ, నవంబర్ 22 : హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన ఎల్కంటి చంద్రయ్య అనారోగ్యం బారిన పడి ప్రభుత్వ దవాఖానలో చేరారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం దవాఖానకు వెళ్లి అతడిని పరామర్శించి ఆర్థిక సహాయం కింద రూ.7 వేలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని దవాఖాన వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంచాల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రావుల వెంకటేశ్, గ్రామ అధ్యక్షుడు కుడుక సత్యం, రైతు బంధు సమితి కన్వీనర్ గడ్డం తిరుపతి, మాజీ సర్పంచ్ బేర ప్రభాకర్, నాయకులు ఆసాది సుధాకర్, జువ్వి కిషన్, తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లి : దమ్మన్నపేటలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మంచిర్యాల ఏసీసీ : నగదును అందజేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

# బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

- ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్



జన్నారం : ఇందన్‌పెల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్




గిరిజనులతో మాట్లాడుతున్న భూక్యా జాన్సన్‌నాయక్

జన్నారం, నవంబర్ 22 : బీఆర్ఎస్ సర్కారుతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, మరింత ప్రగతి సాధించాలంటే కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయాలని ప్రజలను ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ కోరారు. జన్నారం మండలంలోని ఇందన్‌పెల్లి, దేవునిగూడ, కవ్వాల్, కిష్టాపూర్, మొర్రిగూడ, టీజీ పల్లె, కామన్‌పెల్లి, కొత్తపేట, హాస్టల్ తండా, బంగారు తండా, పోనాపూర్ తండా, నాయకపుగూడ, చెర్లపల్లె, కొత్తుర్‌పల్లె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లోని మహిళలు, ప్రజలు మంగళహారతులతో పూలమాలలు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాన్సన్‌నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు వచ్చిన తరువాత గ్రామాలు ఎలా ఉన్నాయో ఒక్కసారి ఆలోచించాలని సూచించారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల కోసం సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గాన్ని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దత్తత తీసుకున్నారని అన్ని రంగాల్లో ఈ నియోజకవర్గం రాబోయే రోజుల్లో ఎంతో అభివృద్ధి చెందనుందన్నారు. దేవునిగూడ గ్రామాన్ని దత్తత తీసుకుని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజన, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాం రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్‌కుమార్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రియాజొద్దీన్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీ ఖాన్, ఆడెపు లక్ష్మీనారాయణ, గుర్రం గోపాల్‌రెడ్డి, సర్పంచ్ గుర్ర శిరీష, బాలసాని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సంబంధిత ప్రతి అంశం తెలిసి ఉండాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, నవంబర్ 22 : సెక్టార్ అధికారులకు ఎన్నికల సంబంధిత ప్రతి అంశం తెలిసి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో సెక్టోరల్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు రమేశ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైందని, శిక్షణలో మాస్టర్ ట్రైనర్ల ద్వారా అందిస్తున్న ప్రతి అంశాన్నీ పూర్తిగా నేర్చుకోవాలని, ఎన్నికల విధులను నిబంధనలకు మేరకు నిర్వహించాలన్నారు. పోలింగ్ రోజు సెక్టోరల్ అధికారులు నిర్వర్తిస్తున్న విధులు ముఖ్యమైనవని, ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ సమయంలో ఏర్పడే సమస్యలు పరిష్కరించడంలో సెక్టోరల్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ నెల 23న ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేయబడిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ కమిషనింగ్ ప్రకియ పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో 743 పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

## ఉపాధ్యాయుల పనితీరు భేష్

- ఆర్‌జేడీ కే సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఆర్‌జేడీ కే సత్యనారాయణరెడ్డి

జన్నారం, నవంబర్ 22 : మండలంలోని కలమడుగు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పనితీరు అభినందనీయమని ఆర్‌జేడీ కే సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలమడుగు పాఠశాలను ఆస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థుల గదుల్లోకి వెళ్లి గణితం, భౌతిక రసాయన శాస్త్రం, సాంఘిక శాస్త్రంలో పలువురు విద్యార్థులు ప్రశ్నలు వేయగా సమాధానాలను చకచకా చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి, ఉపాధ్యాయులు జీ శ్రీనివాస్, ఎం నర్సయ్య, ఆర్ కవిత, వీ శ్రీనివాస్, బీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉమ్మడి ఆదిలాబాద్‌లో విదేశీ బృందం పర్యటన



జన్నారంలో విదేశీయుల బృందం

జన్నారం, నవంబర్ 22 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో స్పెయిన్, బ్రిటన్, జర్మనీ దేశాలకు చెందిన 10 మంది ప్రతినిధుల బృందం పర్యటిస్తున్నది. ఇందులో భాగంగా జన్నారం మండలానికి వచ్చిన వారు హరిత రిసార్ట్‌లో బసచేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు వెళ్లి పత్తి పంటను పరిశీలించడంతో పాటు సేంద్రియ పద్ధతిలో సాగు విధానంపై అవగాహన కల్పించనున్నట్లు వారు తెలిపారు.

## ఉపాధి హామీపై సమావేశం

వేమనపల్లి, నవంబర్ 22 : వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో లక్ష్మయ్య ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే సంవత్సరానికి నర్సరీ పనులను ముమ్మరం చేయాలని సూచించారు. ఉపాధి కూలీలందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఉపాధి హామీపనుల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీవో బాపురావు, ఏపీవో సత్య ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.